# అప్పు

లకుమ

రామచంద్రుడికి ఆ వీధిగుండా పోవాలంటేనే భయంగా ఉంది. అందునా పగటిపూట పోవాలంటే మరీ భయంగా ఉంది. అదే రాత్రి అంటారా? భయం మాటే . రామచంద్రుడి దరిదావులకు రావటానికి భయపడుతుంది.

అసలు రామచంద్రుడికి ఆ వీధిగుండా రాత్రివూట పోనవసరమే లేదు. అటు మొన్న ఒక్క రాత్రి మినహాయిస్తే ఆ తరువాత ఆ వీధిలో రామచంద్రుడు రాత్రి పూటలు నడిచిందీ లేదు.

'రామచంద్రుడి భయమల్లా ఒక్కటే, అతనికున్న అప్పు... అదీ ఇరవై రూపాయల అప్పు... !

రామచంద్రుడికి సీత లేదు. సీత లేదంటే లేదని కాదు. ఏడాది క్రితంవరకూ ఉంది. ఆమె కేన్సర్‌తో ఆర్నెల్ల పాటు మంచంలో తీసుకొని తీసుకొని చనిపోయింది. బ్రతికుండగా ఆమె బాధ చూళ్ళేక చనిపోవటమే మంచి దనుకున్నాడు రామచంద్రుడు. తీరా చనిపోయాక చిన్నపిల్లాడిలా శవం మీద పడి బావురుమని ఏడ్చిందీ రామచంద్రుడే!

ఇంతకీ రామచంద్రుడి భార్య పేరు సీత కాదు. కౌసల్య!

రామచంద్రుడికి ఒక కొడుకున్నాడు. వాడికి పదే ళ్ళుంటాయి. వాడి పేరు తండ్రి పేరే. రామచంద్రుడి తండ్రి పేరు లక్ష్మయ్య. లక్ష్మయ్య ఇప్పుడు మూడో తరగతి చదువుకుంటున్నాడు. వాడు ఒకటో తరగతి రెండుసార్లూ, రెండవ తరగతి మూడుసార్లూ చదివాడు. అట్లా చదవటమే మంచిదని రామచంద్రుడి అభిప్రాయం. పునాది గట్టిగా ఉంటుందని ఎవరో ఎగతాళిగా అంటే అదే నిజ మనుకున్నాడు వెర్రి రామచంద్రుడు!

లేకుంటే లక్ష్మయ్య ఈ ఏడాది ఆరో తరగతిలో ఉండాల్సిన వాడు!

రామచంద్రుడికి నడి ఊళ్ళో ఒక పూరిపాక ఉంది. అది రెండు నిట్రాళ్ళది. దాని మట్టి గోడలు ఆ మొగుడూ పెళ్ళాలు రెక్కలు ముక్కలు చేసుకుని కట్టినవి. లోపలి వక్క గోడల పూత చూసినప్పుడల్లా రామచంద్రుడికి పోయిన పెళ్ళామే గుర్తుకు వస్తుంది. ఆ తరువాత కను కొలకుల్లో వెచ్చటి నీరు నిలుస్తుంది.

పాక చుట్టూరా నాలుగు సెంట్ల స్థలం ఉంది. దాన్లో రెండు కొబ్బరి చెట్లూ, ఒక అవిశె చెట్టూ, ఒక జామ మొక్క ఉన్నాయి. ఒకటీ అరా కూరగాయల పాదులు కూడా ఉన్నాయి. పాక మీదికి సొరపాదు ఇప్పుడిప్పుడే పాకటం నేర్చుకుంటోంది.

ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో తండ్రి మిగిల్చిపోయిన ఎకరంన ర మాగాణి ఉంది. అది రామచంద్రుడి తండ్రి తండ్రి కష్టార్జితం. ఆ చెక్కను చెక్కు చెదరకుండా లక్ష్మయ్య కాపాడగలిగాడు. ఇప్పుడు రామచంద్రుడూ దాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నాడు.

భార్య మంచంలో పడి ఉన్నప్పుడు చాలామంది మంచి వైద్యం చేయించమని రామచంద్రుడి చెవుల్లో ఇళ్ళు కట్టుకుని శతపోరారు. రామచంద్రుడు ససేమిరా వినిపించుకోలా. 'మొత్తం అఖర్లేదు. పై అరెకరం అమ్మితే సరిపోతుం'దన్నారు కొన్త దగ్గర వాళ్ళు, రామచంద్రుడి దగ్గర చనువున్న వాళ్ళూ. ఆ ఒక్క మాటతో వాళ్ళంత అమాంతం రామచంద్రుడికి దూరమైపోయారు.

దాంతో ఊరూ వాడా ఏకమై బంధువు లందర్నీ రామచంద్రుడే దూరం చేసుకున్నా డన్నారు. రామచంద్రుడు మాత్రం 'సెంటు భూమిలేని బికారులు తన బాడవ పొలం చూసి కళ్ళలో నిప్పులు పోసుకుంటున్నా' రన్నాడు.


అట్లాగని రామచంద్రుడు తన భార్యని పూర్తిగా ఉపేక్షించి చంపేశాడని చెప్పటానికి వీల్లేదు. అందిన దగ్గరల్లా చేబదుళ్ళ రూపంలో వందలు తెచ్చాడు. వందల రూపాయల మందుల్ని మింగేసి ఇంక మింగలేక భార్య వెళ్ళిపోయింది. అయినా భార్య తాలూకు అప్పులు రామచంద్రుణ్ణి రోజూ వేపుకు తింటూనే ఉన్నాయి. ఈ ఏడాదిలోనూ తన రెక్కలు ముక్కలు చేసుకుని అప్పుల్ని సగానికి పైగానే తీర్చాడు. వడ్డీ ల్లేకుంటే అవి ఎప్పుడో తీరిపోయేవి. ఇంకా రామచంద్రుడు చెల్లకట్టవలసిన బాకీలు ఏమన్నా ఉన్నాయంటే అవి వడ్డీల తాలూకువే!

రామచంద్రుడు అప్పుడప్పుడూ కల్లు తాగుతాడు. అమావాస్యకో, పౌర్ణానికో ప్రభుత్వ సారాయి తాగుతాడు. చుట్ట మాత్రం ముప్పూటలా తాగుతాడు. రామచంద్రుడి పూరిపాకకు మళ్ళీ ఆడదిక్కు లేకపోవటంతో అది ఎప్పుడూ బావురుమంటూనే ఉంటుంది. అది రామచంద్రుడి ఏకపత్నీవ్రత ప్రతీక అనుకుంటే పొరబాటు. మళ్ళీ తను పెళ్ళి చేసుకుంటే లక్ష్మయ్య బతుకు బండలు చేయటమేనని రామచంద్రుడి కో స్థిర అభిప్రాయం ఉంది.

రామచంద్రుడు పొద్దున్నే లేచీలేవగానే ఇంత కూడు ఉడకేస్తాడు. దాన్లోకి హుషారుగున్న రోజున కూరలాంటి దేదో చేస్తాడు. లేకపోతే అటకమీది ఊరగాయే ఆ తండ్రీ, కొడుకులకు ఆ రోజుకు గతి! దానికి తోడు పక్కింటి చెవిటమ్మ [ఆమెకి బ్రహ్మ చెముడు. అందుకే ఆమెను తెలిసిన వాళ్ళంత అట్లా పిలవటం.] పోసిన కాసిని మజ్జిగనీళ్ళు!

కొడు క్కింత పెట్టి బడికి సాగనంపిం తరువాత తను పొలం వెళ్తాడు. తను చేసే కాయకష్టం లక్ష్మయ్య చెయ్యకూడదనే రామచంద్రుడి ఆరాటం... అందుకే మళ్ళీ పెళ్ళికి సిద్ధపడకపోవటం... ఇందుకే రామచంద్రుణ్ణి అందరూ మెచ్చుకోలుగా చూడటం...

రామచంద్రుడు పొలం వెళ్ళేప్పుడల్లా పలుగో, పారో చేతిలో ఉంటూనే ఉంటుంది. అతనికి వచ్చిన పనల్లా రెండే - పలుగు పనీ, పార పనీ!



పగలంతా కష్టపడతాడు. రాత్రంతా గుర్రుపట్టి నిద్రపోతాడు.

ఒక్క మాటలో చెప్పాలంటే రామచంద్రుడు రైతు కూలీ!

అప్పటికే వరి నాట్లు ప్రారంభమయ్యి వారం రోజులు కావస్తోంది. ఈ వారం రోజులుగా రామచంద్రుడు పార పనికే పోతున్నాడు.

రామచంద్రుడికి దుగాలు వెయ్యటం బాగా వచ్చు. రామచంద్రుడు దుగం చెక్కడం అయిపోయిన మడి వంక చూస్తే చాలు అదీ కొత్తగా కట్టిన వరి మడిలా తీర్చిదిద్దినట్టు ఉంటుంది. దుగాలు వెయ్యటంలో అంతటి దిట్ట రామచంద్రుడు. రామచంద్రుడే కావాలనుకున్నవాళ్ళు రెండు మూడు రోజులు ముందే రామచంద్రుడికి చెబుతారు. రామచంద్రుడు ఒక్క రోజులో మళ్ళు చిన్న చిన్నవైతే ఎకరం, మళ్ళు పెద్దవైతే ఎకరంన్నర విస్తీర్ణం దుగాలు వేస్తాడు. పనిలోకి పొద్దున్నే వస్తాడు. పొద్దు గుంకినాకే పనిలోంచి లేస్తాడు. అందుకే రోజు కూలి ఇరవై రూపాయల్నీ టకాయించి మరీ తీసుకుంటాడు. రామచంద్రుడి పని తీరు చూసిన ఏ రైతూ ఇరవై ఎక్కువని ఎప్పుడూ అనుకోలేదు. ఒకరూ ఇద్దరూ అనుకున్నా ఇవ్వకా తప్పలేదు.

ప్రస్తుతం రామచంద్రుడు మున్సబుగారికి దుగాలు వేస్తున్నాడు. రామచంద్రుడితో పాటు గోపాలం ముఠా కూడా దుగాలు వేస్తోంది. మున్సబుగారి దుగాలు మొత్తం రామచంద్రుడే వెయ్యాలంటే మూడు నెలలకు పైనే పడుతుంది. అంత పొలం మున్సబుగారిది. అందులోనూ తూము క్రింద పొలం ఆయన్ది. నారు సరిగ్గా ఎదగలేదని ఆలస్యం చేశాడు కానీ, ఈపాటికే నాటు పడిపోవలసింది.

మున్సబుగారి పనిలోకి వెళ్ళటం మొదలుపెట్టి రామచంద్రుడికి ఇది మూడో రోజు. ఇంకా నాలుగైదు రోజుల పని ఉంటుంది. అంటే ఎంత లేదన్నా నూట యాభై రూపాయ లొస్తాయి.

## నేనూ అంతే!

హోటల్ సర్వర్ సత్యానందంతో అప్పారావు - ''ఇడ్లీలు పువ్వుల్లా మెత్తగా ఉన్నాయి'' అన్నాడు.

''అవును. దాని కెందుకు సార్ అంతగా బాధపడిపోతున్నారు?'' అని ఆశ్చర్యం ప్రకటించాడు సర్వారాయుడు.

''ఆఁ ఏం లేదూ, ఇవి తిన్నాక నేనూ ఇంత మెత్తగా పిండిరుబ్బాలి కదాని!'' అన్నాడు అప్పారావు మెల్లగా.

- దాసరి రాము [తెనాలి]

అయితే మున్సబుగారితో ఒక తిరకాసుంది. తిరకాసంటే ఆయన పన్జేయించుకుని కూలి డబ్బులు ఎగ్గొట్టాడని కాదు. తన దగ్గర ఇంక పని లేదు అన్నంతవరకూ చేయించుకుని ఆనక డబ్బు మొత్తం లెక్కగట్టి అణాపైసల్తో సహా ఇస్తాడు.

రెండు రోజులుగా రామచంద్రుడికి ఇరవై రూపాయలు మరీ అవసరంగా కావాల్సి వచ్చినయ్. రామచంద్రుడు మున్సబుగారిని నోరు తెరిచి అడగలేదు. పని మధ్యలో అడిగినా ప్రయోజనం ఉండదని ఆయన దగ్గర పన్జేసే ప్రతి కూలోడికీ తెలుసు. ఒకవేళ ధైర్యం చేసి ఎవడన్నా అడిగితే వాడు పని చేసి ఉన్నంతవరకూ డబ్బు లెక్క చూసి ముఖాన కొడతాడు: ఆపైన 'తన పనిలోకి ఇంకెప్పుడూ రావద్దని' ఒక హెచ్చరిక చేస్తాడు. అంతటి మొండిపీనుగ ఆ మున్సబు.

అందుకే రామచంద్రుడూ అడగదల్చుకోలేదు. అడిగి చేసే చేసే పనికి నీ ళ్ళొదులుకోదల్చుకోలా. పైగా ఆయన ఆ ఊరి మున్సబు. తనకు చూస్తే ఎకరంన్నర పొలం కూడా ఉంది. మున్సబుతో ఎప్పుడు ఏ అవసరం వస్తుందో అని చెప్పి మౌనమే మేలనుకున్నాడు రామచంద్రుడు.

రామచంద్రుడి పొలం, మున్సబుగారి సామ్రాజ్యమూ ఒకే చెరువు కింద. అంతకుమించి ఒకే తూము కింద. రామచంద్రుడిది తూము చివరి పొలం. అయినా దాంట్లో బంగారం పడుతుంది. అయితే అదింకా నాటుకు నోచుకోలేదు. రామచంద్రుడి పొలానికి సరిపడా నారు కూడా ప్రతి ఏడూ మున్సబుగారే ఇస్తున్నారు. నారుకి పదీ పరక్కీ మించి ఎప్పుడూ తీసుకోలేదు.

మున్సబుగారి పొలంలోకి పోవాలన్నా తన పొలంలోకి పోవాలన్నా రామచంద్రుడు వీరన్న చెరువు [దాన్ని అంతా వీరం చెరువనే అంటారు] కట్టమీదనుంచి, లేదంటే దానికి దిగువన ఉన్న మట్టి రోడ్డు మీద నుంచే పోవాలి. ఇంకో దారి లేదు. కాదు కూడదంటే హనుమంతరావుగారి ఫాక్టరీ పైనుంచి పోవాలి. అట్లా నడిస్తే చాలా చుట్టవుతుంది. పనిలోకి వంగేనరికి బారెడు పొద్దెక్కుతుంది. పొద్దెక్కితే మున్సబు అగ్గిమీద గుగ్గిలం అయిపోతాడు. ఏం చేయాలో తోచలేదు రామచంద్రుడికి.

అప్పు విషయమై ఋణదాతకు రెండు రోజులుగా ఏదో చెప్పుకుని పోతున్నాడు.

ఈ రోజు ఏం చెప్పాలా అని ఆలోచించుకుంటూ ఇంటి దగ్గర బయలుదేరాడు రామచంద్రుడు.

రామచంద్రుడు పరాగ్గా నడుస్తున్నాడు. నడుస్తున్నాడే కానీ కాలు ముందుకు పట్టం లేదు. చేతులు ముందుకు సాగి నడక్కి ఏమాత్రం ఊతం ఇవ్వటం లేదు. కారణం కుడి చేతిలోని పారా, ఎడం చేతిలోని అన్నం మూటా.

అప్పటికే కాస్త పొద్దెక్కింది.


రామచంద్రుడు ఆంజనేయస్వామి గుడి దగ్గర తారోడ్డు దిగి మట్టి రోడ్డెక్కాడు. ఆంజనేయస్వామికి దణ్ణం పెట్టుకోవటం మరిచాడు. మట్టి రోడ్డు పక్కనుంచే చెరువు గట్టూ ప్రారంభమవుతుంది. ఎందుకైనా మంచిదని మట్టి రోడ్డుమీద నడుస్తున్న వాడల్లా చెరువు గట్టెక్కాడు. అయినా నడక సాగటం లేదు. అంత లావు రామచంద్రుడికీ గుండెలు గుబగుబలాడుతున్నాయి. ఆపాదమస్తకం అతన్ని 'భయం దయ్యం' ఆవహించింది. ఏ మూలనుంచి పొంచి ఉన్న ఆపద వస్తుందోనని దిక్కులు చూస్తూ బెదురు నక్కలా నడుస్తున్నాడు.

ఎదురు చూస్తున్న ఆపద రానేవచ్చింది. వచ్చీ రావటమే సుడిగాలిలా వచ్చింది. అది

అయ్యగారి పెంపుడుకుక్క పరమపదించింది! ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు రావాల్సినోళ్ళంతా, తమ విచారం తెలియజేస్తున్నారు!!




ఉండవయ్యా... మగడా... ఓ గంటే కదా మాట్లాడింది... ఇంకా చిన్నది, బుజ్జీ... వాళ్ళ ఆఖరి దీ మిగిలున్నారు!!



జడివానలా వచ్చింది. అట్లా వచ్చిందే జానకమ్మ! రామచంద్రుడు రెండు రోజులుగా బాకీ సొమ్ము ఇస్తాను ఇస్తాను అని ఎవరితో అంటున్నాడో ఆ జానకమ్మ.

మగరాయుడిలా రామచంద్రుడికి ఎదురుగా నిల్చుంది. రామచంద్రుడికి గోచీ ఊడినంత పనైంది. గొంతు తడారిపోయింది. అంతటి వానాకాలంలోనూ. చుట్టూ ఒకసారి చూసి 'శిలావిగ్రహం'లా నిలబడిపోయాడు రామచంద్రుడు.

రెండేళ్ళుగా జానకమ్మ ఆ చెరువు కట్ట పక్కనే గుడిసె వేసుకొని ఉంటోంది. ఊళ్ళోని ఇల్లు తాగుబోతు మొగుడు చేసిన అప్పులకు చెల్లుబడై పోగా జానకమ్మకు కొంత డబ్బును కూడా మిగిల్చింది.

జానకమ్మ మొగుడు పోయి మూడేళ్ళు దాటింది. కొంతమంది రోగంతో పోయా డంటారు. మరి కొంతమంది జానకమ్మే మందో మాకో పెట్టి చంపేసిం దంటారు. పాపం పుణ్యాం పరమాత్ముడికే తెలియాలి.

జానకమ్మకు ఒక కూతు రుంది. అది ఎవణ్ణో లేవదీసుకుపోయి ఏణ్ణర్థం అయ్యింది. కూతురు ఎక్కడ ఉందో జానకమ్మకే తెలియదు. అది తన కడుపున 'చెడపుట్టిం'దంటుంది. దాని ఊసే తన దగ్గర తేవద్దంటుంది.

ఆ మధ్య ఏలూరులో కనిపించిందని ఎవరో చెప్తే విన్నది. కూతుర్ని చూసి వచ్చేందుకు జానకమ్మ మాత్రం ఏలూరు పోలా.

జానకమ్మ బాగా తెలిసిన వాళ్ళకు పదీ పరకా అప్పు లిస్తుంది. తెలియని వాళ్ళైతే బిందో, కాగో పెట్టుకుని డబ్బిస్తుంది. అప్పుడప్పుడూ చిన్నపాటి నగా నట్రా కూడా తాకట్టు పెట్టుకుంటుంది. తాకట్టు వస్తువుల గడువు చెల్లిపోతే అవి ఇంక జానకమ్మ సొత్తే. వడ్డీకి వడ్డీ కడుతుంది. చాలామంది అసలు కట్టినా వడ్డీలు కట్టలేక సొమ్ముల్ని జానకమ్మ దగ్గరే వదిలేసుకున్నారు. ఆ లెక్కన చూస్తే జానకమ్మ దగ్గర తాకట్టు సొమ్ములు చాలానే ఉన్నాయ్! జానకమ్మ ఇదంతా వడ్డీల మీద సంపాదించ లేదంటుంది పక్కనే ఉంటున్న

## 13 లక్షల పద్యాల కవి

పర్షియా దేశంలో [నేటి ఇరాన్] రుదాగీ అనే కవి క్రీ. శ. 870-954 సంవత్సరాల మధ్య కాలంలో జీవించాడు. ఈయన పుట్టు గుడ్డి. అయినా అమోఘమైన కవితా పటిమ గలిగినవాడు. ఆ రోజుల్లో పరిషయాని రెండవ షానాజర్ పరిపాలిస్తుండేవాడు. ఈయనకి వైన్ అంటే మహా ప్రీతి. నిత్యమూ దాన్ని సేవిస్తుండడమే ఆయన వ్యాపకం ఈ రాజుగారి మెప్పు పొందడం రుదాగీ నూరు గ్రంథాలలో 13 లక్షల పద్యాలలో వైన్ గుణగణాలను కీర్తిస్తూ రాశాడు.

వాటిలోని ఒక పద్యానికి ఒక ప్రత్యేకత ఉంది. దీన్ని రాసిన రోజునే కవిగారి భార్య ఒకే కాన్పులో నలుగుర్ని ప్రసవించింది. కోడలికి ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు పుట్టారు. కోడలి కోడలికి కవల శిశువులు కలిగారు. అంటే ఒకే రోజున రుదాగీగారు నలుగురికి తండ్రి, ముగ్గురికి తాత, ఇద్దరికి ముత్తాత అయ్యా రన్నమాట. అంటే ఒకే ఇంటిలో ఒకే రోజున తొమ్మిదిమంది జన్మించా రన్నమాట. వీరు నవగ్రహాలు కాదు కదా!

-కె. ఆర్. కె. మోహన్

సావిత్రి. ఆ మాట కొస్తే సావిత్రే అట్లా సంపాదిస్తోంది అంటుంది జానకమ్మ. జానకమ్మకు నలభై ఏళ్ళుంటాయి. మనిషి ఎర్రగా బుర్రగా బాగానే ఉంటుంది. నోరు మాత్రం కాస్త పెద్దదనే చెప్పాలి. ఇప్పుడు ఆ పెద్ద నోరే ఎక్కడ తెరుచుకుని తన్ను కబళించేస్తుందోనని రామచంద్రుడు హడిలి చస్తున్నాడు. అప్పటివరకూ కట్టమీద నిల్చున్న ఇద్దర్నీ ఎవరూ చూడకపోవటంతో కాసేపు బ్రతికిపోయా ననుకున్నాడు రామచంద్రుడు.

కంట పడదేమో అనుకున్న రామచంద్రుడు కంట పడేసరికి బాకీ వసూలైం దనుకుంది జానకమ్మ.

నిజానికి రామచంద్రుడు జానకమ్మకు ఇవ్వవలసింది ఇరవై రూపాయలే. పాపం! రామచంద్రుడూ రెం డ్రోజులుగా ఇద్దా మనుకుంటూనే ఉన్నాడు. ఇవ్వలేకపోయాడు. అదీ మున్సబుగారి పనిలోకి వెళ్ళటం వలన

ఇవ్వలేకపోవటం. ఆ మాటే రెండు రోజులుగా చెప్పుకు వస్తున్నాడు. మళ్ళీ పాత పాటే పాడా లనుకున్నాడు. జానకమ్మ రామచంద్రుణ్ణే చూస్తోంది. ఆమెకు మరేమీ కనిపించటం లేదు.

"చూడు... జానకమ్మా..." అన్నాడు రామచంద్రుడు ఎంతో ప్రయత్నంమీద గొంతు పెకల్చుకుని.

జానకమ్మకు అర్థమైపోయింది. ఆ మాటల తాలూకు అంతరార్థం పూర్తిగా అర్థమైపోయింది. ఇక మామూలు పద్ధతిలో అయితే బాకీ వసూలు కాదనుకుంది. క్షణ క్షణానికీ ఆ భావన మనసులో గట్టి పడసాగింది.

"ఏమిటయ్యా చూసేది? రెం డ్రోజులుగా చూస్తూనే ఉన్నానుగా! నా కదంతా తెలియదు. ఈ రోజు మాత్రం నువ్వు ఇరవై రూపాయలు చేతిలో పెట్టి మరీ కదలాల్సిందే" అంది కటువుగా.

జానకమ్మ వాక్ప్రవాహానికి కాసేపు నోరు తెరచి ఉంచక తప్పలేదు రామచంద్రుడికి.

జానకమ్మ అట్లా నోట్లో నోరు పెట్టి మాట్లాడటం అదీ నలుగురూ నడిచే నడవలో రామచంద్రుడి కేం బాగాలేదు. రామచంద్రుడికి బాగా ఉండేట్లు నడుచుకోవటానికి జానకమ్మ అతగాడి పెళ్ళామా? ఏమన్నానా? అక్కడి కేదో లోకంలోని పెళ్ళాలంటూ మొగుడి మాట ప్రకారం నడుచుకుంటున్నట్లు!


జానకమ్మ నోరు మంచిది కాదని రామచంద్రుడి కేం తెలియంది కాదు.


"ఈ ఒక్కసారి... నన్ను నమ్ము జానకమ్మా! సాయంత్రం... పన్లోంచి వచ్చేటప్పుడు... తప్పకుండా... ఇచ్చేస్తాగా" అన్నాడు రామచంద్రుడు బ్రతిమాలే ధోరణిలో.

అప్పటికి వీ ళ్ళిద్దరూ కాక అక్కడ నలుగురు మనుష లున్నారు.

"రెం డ్రోజులుగా ఇవ్వలేదు గానీ సాయంత్రం ఇస్తావట, సాయంత్రం. ముందు ఇచ్చి కదలవయ్యా! ఇదిగో రామచంద్రుడూ! న న్నేమనుకున్నావో ఏమిటో? నాగ్గాని తిక్క రేగితే... నే నసలే మంచిదాన్ని కాదు... ఆ ..." అంది జానకమ్మ నోటిని అంతకంతకూ పెద్దది చేస్తూ.

జానకమ్మ మాటలకు చుట్టూ ఉన్న నలుగురు



మనుమలు తమను నాలుగుతో ఒకసారి గుణించుకున్నారు.

రామచంద్రుడూ అని తనను పేరు పెట్టి అదీ పదుగురిలో పిల్చేసరికి రామచంద్రుడికి తల కొట్టేసినట్లయింది. అంత ముఖం ఇంత్తై కూర్చుంది. మనసు చివుక్కుమంది.

"ఈ ఒక్కసారికీ... నన్ను నమ్ము... సాయంత్రం... ఇచ్చేస్తాగా... ఇవ్వకపోతే అప్పు డడుగు" అన్నాడు రామచంద్రుడు బాధను దిగమింగుకొంటూ.

రామచంద్రుడు ఏమన్నదీ అక్కడ చేరిన వాళ్ళలో ఎక్కువమందికి వినపళ్ళేదు. వాళ్ళంత జానకమ్మ తగువును ఎంతవరకూ తీసుకుపోతుందా? అన్న ఉత్కంఠతో ఉన్నారు.

కాసేపటికి నలుగురు ఆడవాళ్ళు కూడా చేరి అక్కడి జనాభా సంఖ్యను పెంచేశారు.

జానకమ్మ వెంటనే అందుకుంది - "ఏమిటయ్యా! ఇంక ను వ్విచ్చేదీ, నే నడిగేదీ? అనలు నీలాంటివాణ్ణీ..." అంటూ ఆగిపోయింది ఏదో జ్ఞాపకం వచ్చిందాన్లా. ఆ వెంటనే విసురుగా కాస్త ముందు కొచ్చి రామచంద్రుడి చేతిలోని పారను లాక్కుంది.

జానకమ్మ హై బీ.పీ.యే ఆమెను ఆ రాస్థాయికి తీసుకెళ్ళిందని జానకమ్మకే తెలియదు. ఇక ఆ విషయం రామచంద్రుడి కెట్లా తెలుస్తుంది?

అయితే 'పార' ఎందుకు తీసుకుందో తెలిసిపోయింది రామచంద్రుడికి.

పార చేతులు మారేటప్పటికల్లా అక్కడ మరో పదిమంది పోగయ్యారు. ఆ పదిమందిలోనూ ఎనమండుగురు ఆడవాళ్ళే. ముగ్గురి చంకల్లో అర టిక్కెట్లు కూడా ఉన్నాయి. రెండు అర టిక్కెట్ల నోళ్ళలో వేళ్ళు కూడా ఉన్నాయి.

రామచంద్రుడి ఎడం చెయి కుడి చేతిని వెక్కిరింతగా చూసింది. ఆ చూపుకు అర్థం మాత్రం స్పష్టమే. ఆ అర్థం 'పారను గట్టిగా పట్టుకోలేకపోయావేం?' అనే!

"జానకమ్మా! మర్యాదగా పా రియ్యి... లేకపోతేనా?" అంటూ ఊగిపోయాడు రామచంద్రుడు. అయితే రామచంద్రుడికేం హై బీపీ లేదు. అంతకు మించిన పౌరుషం మాత్రం పొడుచుకు వచ్చింది.

"ఇవ్వను గాక ఇవ్వను. ఏం చేస్తావయ్యా నువ్వు, ఏం చేస్తావు? అనలు నీ చేత ఏమౌతుందని?" అంది లౌడ్ స్పీకర్‌లా జానకమ్మ. జానకమ్మ కుడి చేతిలో పా రుంది. ఎడం చేయి మాత్రం జానకమ్మ మాట్లాడుతున్నప్పుడల్లా గాలిలోకి లేస్తూ మాటల కనుగుణంగా సంజ్ఞలు చేస్తోంది.

చుట్టూరా దడి కట్టిన జనాలను మాత్రం ఇది కాణీ ఖర్చులేని వినోదం లాగుంది. తగువు తెగటం వాళ్ళలో ఎవ్వరికీ ఇష్టం లేనట్టుగా ఉంది.


అంతకంతకూ పెరుగుతున్న కట్టమీది గుడిసెల్లోని జనంతో, పని పాటలకు ఆ దారిన పోయే జనంతో ఆ ప్రదేశం చిన్నపాటి 'జాతర' లాగుంది.

'నువ్వా అంటే నువ్వా' అనుకుంటున్న జానకమ్మా, రామచంద్రుడూ చాలాసేపటివరకూ అంతమంది జనాన్నీ గమనించలేదు.

అయితే మొదట గమనించింది మాత్రం జానకమ్మే.

రామచంద్రుడు పార, లాక్కోవటానికి ప్రయత్నించి విఫలు డయ్యాడు. అందు క్కారణం జానకమ్మ అతనికంటే నాలుగు ఆకులు ఎక్కువ చదవటమే. రామచంద్రుడు మళ్ళీ ప్రయత్నించలేదు. ఎవరన్నా అన్నా తననే అంటారు. 'ఆడదానిమీదికి పోవటం తప్పా తప్పున్నారా?' అని. అందుకే రామచంద్రుడు మిన్నకుండిపోయాడు. మన్ను తిన్న మిన్నాగులా ఉండిపోయాడు.

ఎవరన్నా పెద్దమనిషి తగువులో జోక్యం చేసుకుని, తనను ఈ గండంనుంచి గట్టెక్కిస్తే బాగుండు ననుకున్నాడు రామచంద్రుడు స్వగతంలో. ఈ రామచంద్రుడి మొర ఆ శ్రీరామచంద్రుడు విన్నాడో ఏమో [తన పేరు పెట్టుకున్న పాపానికి] జనంలో ఉన్న పెద్దమనిషి 'రంగయ్య'ను అర్థించాడు 'తగవు తీర్చవయ్యా రంగయ్యా!' అని.




జానకమ్మ చివరి అస్త్రంగా పార తీసుకుని తన పాకవైపుకు నాలుగడుగులు వేసింది. రామచంద్రుడు తన చరాస్థిని లాక్కోబోయాడు. జానకమ్మ అరవై రూపాయల పారని అంగుళంమేర కూడా దొరకనివ్వలేదు. అర్ధగంట నుంచీ 'జానకమ్మా రామచంద్రుల సంవాదాన్నే' చూస్తున్న రంగయ్య రంగంలోకి దూకాడు. ఇద్దర్నీ విడదీశాడు. ఇద్దర్నీ కేకలేశాడు. నిజమైన పెద్దమనిషి ఎట్లా ప్రవర్తించాలో అట్లానే ప్రవర్తించాడు రంగయ్య. అంతెందుకు? అప్పుడే నలుగురి మెప్పు కూడా సంపాదించాడు రంగయ్య బహువరాక్!

జనం అంత తగువు ఎట్లా ముగుస్తుదా అన్నట్టు స్వంత పనను కూడా మర్చిపోయి చూస్తున్నారు. ఇప్పుడు వాళ్ళ దృష్టంత రంగయ్య మీదే. రంగయ్య చెప్పే మధ్యవర్తిత్వం మీదే!

ఎట్టకేలకు రంగయ్య మాట్లాడాడు. రంగయ్య జానకమ్మవైపుకు తిరిగి నిల్చున్నాడు.

"చూడు జానకమ్మా! అనలు రామచంద్రుడు నీ కెంతివ్వాలి?" అన్నాడు రంగయ్య లౌక్యం ఒలకపోస్తూ.

'ఇరవై' అంది జానకమ్మ టకీమని. జానకమ్మ చేతిలో పార అట్లాగే ఉంది. ఆరునూరైనా డబ్బిచ్చాకే పార వదుల్తా నన్నట్టుగా గట్టిగా పట్టుకుంది. ఆమె పట్టులో 'ఉడుం' ఉంది.

ఈసారి రంగయ్య రామచంద్రుడి వైపుకు తిరిగాడు.

"రామచంద్రుడూ! జానకమ్మకు నువ్వు ఇవ్వాల్సింది ఇరవయ్యేనా?" అడిగాడు రంగయ్య. ఆ అడగటంలో 'కరెక్టు'గా చెప్పమన్న 'వార్నింగు' కూడా ఉంది.

రంగయ్య రామచంద్రుణ్ణి గట్టిగా అడగటమైతే అడిగాడు కానీ, అతనికి లోలోపల పీకుతూనే ఉంది ఒక విషయం. ఆ విషయాన్ని రంగయ్య మాత్రం ముందు ఎందుకు చెప్తాడు? అనలు విషయాన్ని రామచంద్రుడి నోటనో, జానకమ్మ నోటనో రాబట్టా లనుకున్నాడు. ఎందుకంటే తనకు తెలిసినంతవరకూ పదీ పరకా అదీ రొఖ్ఖంగా అప్పు చేయాల్సిన అవసరం లేదు రామచంద్రుడికి. అందులోనూ జానకమ్మ లాంటి ఆడవాళ్ళ దగ్గర.

"ఇరవయ్యే" అన్నాడు జవాబుగా రామచంద్రుడు. ఆ జవాబులో నిజాయితీ కొట్టవచ్చినట్టు కనిపించింది. రామచంద్రుడు దారిలోకి వస్తున్నా డనుకున్నాడు రంగయ్య.

"ఎప్పుడు తీసుకున్నావ్?" రామచంద్రుడి కేసి సూటిగా చూస్తూ అడిగాడు. ఆ ప్రశ్న రామచంద్రుడికి 'రామబాణం'లా తగిలింది. కాసేపు గాలం తాకిడికి విలవిల లాడిపోయాడు. శరాఘాతం నుండి కోలుకున్నాక తగువు మాటే మర్చిపోయాడు. చుట్టూ నిలుచున్న జనం కేసి చూస్తూ సిగ్గుతో మెలిదిరిగిపోయాడు.

రామచంద్రుడు బెల్లం కొట్టిన రాయిలా పెదవి విప్పటం లేదు. పెదవి విప్పితే వృథ్వీ దాటుతుం దనుకున్నాడో, ఏమో? పెదవి విప్పకపోయినా కొన్ని

విషయాలు పృథివి దాటుతాయని తెలియని అమాయకుడు!

"నిన్నే రామచంద్రుడూ! ఎప్పుడు తీసుకున్నావో చెప్పు!" అన్నాడు రంగయ్య రెట్టిస్తూ.

రామచంద్రుడేం మాట్లాడకపోవటంతో - "జానకమ్మా! నువ్వన్నా చెప్పు? రామచంద్రుడికి డబ్బులు ఎప్పు డిచ్చావ్?" అన్నాడు రంగయ్య జానకమ్మనే.

జానకమ్మ మాత్రం ఏం చెప్తుంది? అసలు విషయం ఇంతదాకా వస్తుం దనుకుంటే, ఇంతమంది జనం పోగవుత రనుకుంటే రామచంద్రుణ్ణి డబ్బే అడక్కపోయేది. ఎరక్కపోయి అడిగింది. ఇరుక్కుపోయింది.

అంత జానకమ్మవైపే చూస్తున్నారు. ఏమి చెప్తుందా విందామని!

జానకమ్మా 'మూగనోము' పట్టింది.

"నిన్నే జానకమ్మా! అడిగేది, ఎప్పు డిచ్చావంటే పలకవేం?". కాస్త గద్దింపుగా మహా గడుసుగా అడిగాడు రంగయ్య.

"అంత పెద్దమనిషి పట్టుకుని అడుగుతా ంటే చెప్పవేమే?" అంది పక్కింటి సావిత్రి తనకు వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోకుండా. జానకమ్మ సావిత్రి కేసి చురచురా చూసింది. ఆ చూపుకే శక్తుంటే సావిత్రి అక్కడికక్కడే మండి బూడిదయ్యేది.

రంగయ్య జానకమ్మ వైపు అదోలా చూశాడు. మళ్ళీ చచ్చినోడు ఎక్కడ అడుగుతా డో అనుకున్న జానకమ్మ పార అక్కణ్ణే పారేసి వినవిసా నడుచుకుంటూ గుడిసెలోకి వెళ్ళిపోయింది.

ఆశ్చర్యంగా అక్కడి వాళ్ళంతా జానకమ్మ నడచిన దిక్కే చూడసాగారు. రంగయ్య అయితే ముక్కున వేలేసుకున్నాడు అమ్మ! జానకమ్మా! అనుకుని. రామచంద్రుడు మౌనంగా తల వంచుకుని నిల్చున్నాడు. తగువు క్కారణమైన ఇద్దర్లోనూ అక్కడ మిగిలింది రామచంద్రుడే.

"ఎప్పుడు తీసుకున్నావో నువ్వన్నా చెప్పు రామచంద్రుడూ?" ఉత్సాహంగా అడిగాడు రంగయ్య. రామచంద్రుడికి రంగయ్య. చూపులు గుచ్చుకుంటున్నాయి. రామచంద్రుడు మా చెడ్డ ఇబ్బందిగా ముఖం పెట్టాడు.

కొలంబస్ అమెరికాని మొదట కనిపెట్టినట్టు, రామచంద్రుడి ముఖాన్ని అది దాస్తున్న రహస్యాన్ని అంతమందిలోనూ మొదట కనిపెట్టినవాడు రంగయ్యే.

రామచంద్రుడు అంతమందిలోనూ నోరు విప్పడని చప్పునే గ్రహించాడు రంగయ్య.

కింద ఉన్న పారను ఎడం చేత్తో అందుకుని కుడి చేత్తో రామచంద్రుడి రెక్క పుచ్చుకుని "ఇట్లారా" అని కట్టమీద ముందుకి దాదాపు ఇరవై గజాల దూరం నడిపించుకు వెళ్ళాడు. ఇద్దరూ ఒక మామిడి చెట్టు కింద ఆగిపోయారు.

అంత జానకమ్మ గుడిసెలో ఉం దనుకుంటున్నారు. జానకమ్మ గుడిసెలో లేదు. గుడిసె చుట్టూరా దట్టంగా కట్టుకున్న బందేడు కంప దగ్గరగా, కంప మొదట్లో కూర్చుని అక్క డేం జరుగుతున్నదీ అంత వెయి కళ్ళతో గమనిస్తోంది.

రామచంద్రుణ్ణి రంగయ్య నడిపించుకుపోవటం, చెట్టు కింద ఆగిపోవటమూ చూసింది. దాంతో సిగ్గుతో మరింత బిక్కచచ్చి అక్కడే చతికిలపడిపోయింది.

"రామచంద్రుడూ! ఇప్పుడు చెప్పు?" రామచంద్రుడి చెవిలో గుసగుస లాడాడు రంగయ్య. రామచంద్రుడికి ఇంక చెప్పక తప్పని పరిస్థితి.

రామచంద్రుడికీ చెప్పాలనే ఉంది. పైగా అడుగుతున్నది తనకు బాగా కావాల్సిన పెద్దమనిషి రంగయ్య. అయితే ఎట్లా చెప్పటమో తెలియకుండా ఉం దతనికి.

రామచంద్రుడు నీళ్ళు నములుతున్న వాలకం చూస్తుంటే దారిలోకి వస్తున్నా డనుకున్నాడు రంగయ్య.

కొంచెం ఊతం ఇస్తూ "చెప్పు రామచంద్రుడూ" అన్నాడు. అనటంలో అనునయం ఉంది. ఆప్యాయత ఉంది. ఎవరికీ చెప్పన్లే అన్న కొండంత భరోసా తాలూకు అర్థమూ ఉంది.

రామచంద్రుడు ఒకసారి దిక్కు లన్నింటినీ కలయచూశాడు. చుట్టుపక్కల ఇరవై గజాల దూరంవరకూ ఒక్క పురుక్కూడా లేనట్టు నిర్ధారించుకున్నాడు.

"ఏం లేదు రంగయ్యా!" అంటూ మొదలుపెట్టి ఎంతో కథ చెప్పాడు రామచంద్రుడు. చాలామంది మనుమల స్వభావమే అంత!

అటు మొన్న రాత్రి జగపతిరాయుడిగారి సినిమా, రెండో ఆట వదలటం, అప్పటిక్కూడా తనకి కంటిమీదికి కునుకు రాకపోవటం, జానకమ్మ మీదికి అప్పుడప్పుడూ పోయే మనసు మళ్ళిపోవటం, తను మంచంమీదినుంచి లేవటం, చెరువు కట్టమీద నడవటం, జానకమ్మ తడిక తీసి గుడిసె తలుపు గొళ్ళెం చప్పుడు చేయటం, జానకమ్మ గుడిసె తలుపు తీసి లోపలికి రమ్మని వెంటనే గడి పెట్టటం, మూడు గంటలపాటు జానకమ్మ తనకు సుఖా న్నివ్వటం, బయటికి వచ్చేముందు డబ్బులు లేవేదని చెప్పటం, జానకమ్మ 'రేపు ఇద్దువుగాన్లే' అని అనటం, ఆనక తను ఇల్లు చేరుకోవటం అంతా సినిమా స్టోరీలా చెవినేశాడు రామచంద్రుడు.

అంత చెప్పటం అయిపోయాక్కూడా రామచంద్రుడు సిగ్గుపట్టం మాన్లేదు.

రామచంద్రుడు చెపుతున్నంతసేపూ రంగయ్య చెవులు రిక్కించి మరీ విన్నాడు. రంగయ్య వింటున్నంతసేపూ లోలోపల మహా సంబరపడిపోయాడు. గడుసు పిండం కావటంవల్ల బయట పళ్ళేదు. రామచంద్రుడు తన చేతిలో ఉన్న పార కేసి చూట్టం గమనించాడు రంగయ్య.

రంగయ్య చేతిలో ఉన్న పారను రామచంద్రుడి కిచ్చాడు.

"నువ్వు పనిలో కెళ్ళిపో రామచంద్రుడూ!" అంటూ భుజం చరిచాడు మెచ్చుకోలుగా రంగయ్య.

'బ్రతుకు జీవుడా!' అనుకుని రామచంద్రుడు కట్టమీద నడక సాగించాడు. మళ్ళా జానకమ్మ ఎక్కడ కనిపిస్తుందోనని వెనక్కి తిరిగి చూడకుండా అదే పోత పోయాడు.

ఇంకా అక్కడే గుమికూడి చోద్యం చూస్తున్న జనాన్ని "వెళ్ళిపోండి, వెళ్ళిపోండి... ఇక్క డేమన్నా కోతు లాడుతున్నాయా?" అని పెద్దమనిషి తరహాగా కసురుకున్నాడు రంగయ్య.


వాళ్ళలో కాస్త బుర్ర ఉన్నవాళ్ళు విషయం తెలుసుకున్నారు. బుర్రలేని వాళ్ళు చెవులకు పని కల్పించారు.

పది నిముషాల క్రితం అక్కడేం జరగనట్టు ఆ ప్రదేశమంత దాదాపు నిర్మానుష్యమైపోయింది.

జానకమ్మ 'అమ్మయ్య' అని ఊపిరి పీల్చుకుని నిలబడింది కంప లోపలే.

నిలబడ్డ జానకమ్మకు తనవైపే కొంటెగా చూస్తున్న పూల రంగయ్య కనిపించాడు.

రంగయ్య తన మీసాన్ని విలాసంగా దువ్వుతూ కుడి చేతి చూపుడు వేలును పైకెత్తి నర్మగర్భంగా సంజ్ఞ చెయ్యటమూ, ఆ సంజ్ఞ తాలూకు అర్థం




జానకమ్మకు [అర్థం మాత్రం చిరకాల పరిచితమైందే] బోధపడటమూ వరసగా జరిగిపోయినై!

"ఛీ, పాడు చచ్చినోడా!" పైకి వినిపించీ వినబడనట్టుగా తిట్టి, చిత్రంగా గాలిలో మెటికలు విరుస్తూ గుడిసెలోకి జారుకుంది జానకమ్మ.

రంగయ్య 'రానున్న రాత్రికి పొందనున్న సుఖాన్ని' పదే పదే తల్చుకుంటూ... మధ్య మధ్య తగవును నెమరేసుకుంటూ... నవ్వుకుంటూ... పొలం కేసి నడక సాగించాడు.

అప్పటికే బారెడు పొద్దెక్కింది.

రంగయ్య జానకమ్మకు నంజ్జ చెయ్యటం,



జానకమ్మ తిడుతూ మెటికలు విరవటం వగైరాలను, ఒక జీవి తన దడి చాటున నిల్చుని చూణ్ణే చూసింది. ఆ జీవి పేరే సావిత్రి! జానకమ్మకు వృత్తిరీత్యా అయితేనేం? ఏ రీత్యా అయితేనేం? సావిత్రి గట్టి పోటీదారు!

పాపం జానకమ్మే సావిత్రిని గమనించింది కాదు! ★